AKSHARA TODAY

# అక్షర టుడే

TOWARDS... TRUTH, TRUST, TREND

www.aksharatoday.in






### ప్రారంభమైన బతుకమ్మ సంబురాలు

**అక్షరటుడే, నెట్‌వర్క్:** తెలంగాణ సంస్కృతికి ప్రతీక అయిన బతుకమ్మ పండుగ వేడుకలు ప్రారంభమయ్యాయి. ఆదివారం తొలిరోజు ఎంగిలిపూల బతుకమ్మ వేడుక నిర్వహించారు.



### లెండి వాగుకు వరద

**అక్షరటుడే, డోంగ్లీ:** మహారాష్ట్రలో ఎగువన కురిసిన భారీ వర్షాలకు లెండి వాగు ఉధృతంగా ప్రవహి స్తోంది. ఎగువ నుంచి భారీ వస్తుండడంతో వాగు పొంగిపొర్లుతోంది. మద్నూర్ మండలంలోని గోజేగావ్‌కు రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి.



## శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు కొనసాగుతున్న వరద

**అక్షరటుడే, బాల్కొండ:** తెలంగాణ వరప్రదాయిని శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరద కొనసాగుతోంది. జిల్లాలో వర్షాలు తగ్గుముఖం పట్టినప్పటికీ ఎగువన ఉన్న మహారాష్ట్రలో వర్షాలు కురుస్తుండడంతో ప్రాజెక్టుకు భారీ వరద వచ్చి చేరుతోంది. ప్రాజెక్టుకు 1,28,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. దీంతో 25 గేట్లు ఎత్తి 1,16,163 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. పరీవాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. పశువుల కాపరులు, గొర్ల కాపారులు, చేపలు పట్టేవారు, రైతులు, ప్రజలు నది దాటే ప్రయత్నం చేయవద్దని ప్రాజెక్టు ఏఈఈ కొత్తరవి సూచించారు. ప్రాజెక్టు పూర్తి నీటిమట్టం 1091 అడుగులు (80.5 టీఎంసీలు) కాగా.. 1090.09 అడుగుల (80.05 టీఎంసీ) మేర నీరు నిల్వ ఉంది. దీంతో అధికారులు ఎప్పటికప్పుడు ప్రాజెక్టు నీటిమట్టం ఆధారంగా నీటిని దిగువకు వదులుతున్నారు. ప్రాజెక్టులోకి వరద వచ్చి చేరుతుండడంతో 25 గేట్ల నుంచి దిగువకు నీటిని వదులుతున్నారు. అలాగే కాలువ ద్వారా నీటిసరఫరా కొనసాగుతోంది.



## 108 అంబులెన్స్‌లో గర్భిణి ప్రసవం

**అక్షరటుడే, గాంధారి:** అంబులెన్స్‌లో గర్భిణి ప్రసవించింది. అత్యవసర స్థితిలో 108 సిబ్బంది స్పందించి గర్భిణికి ప్రసవం చేశారు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గాంధారి మండలంలోని నాగులూర్ తండా గ్రామానికి చెందిన బస్సీ గంగకు ఆదివారం పురిటి నొప్పులు వచ్చాయి. దీంతో కుటుంబీకులు స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ గంగను పరీక్షించిన వైద్యులు రక్తం తక్కువగా ఉండడంతో కామారెడ్డికి రిఫర్ చేశారు. దీంతో 108 అంబులెన్స్ సిబ్బంది ఆమెను కామారెడ్డి జీజీహెచ్‌కు తరలిస్తుండగా మార్గ మధ్యంలో గర్భిణికి నొప్పులు ఎక్కువయ్యాయి. దీంతో అంబులెన్స్ సిబ్బంది వాహనాన్ని నిలిపేసి.. ఆమెకు ప్రసవం చేశారు. గంగ పండంటి బిడ్డకు జన్మనివ్వగా.. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారు. దీంతో అత్యవసర పరిస్థితుల్లో చురుకుగా స్పందించి తల్లీబిడ్డను కాపాడిన 108 ఈఎంటీ కమలాకర్, పైలెట్ సంజీవ్‌గౌడ్‌కు కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## ఇసుక తరలిస్తున్న టిప్పర్ సీజ్



**అక్షరటుడే, భీమ్‌గల్:** అక్రమంగా ఇసుకను తరలిస్తున్న టిప్పర్‌ను పోలీసులు సీజ్ చేశారు. భీమ్‌గల్ ఎస్సై సందీప్ తెలిపిన వివరాల ప్రకారం.. భీమ్‌గల్ మండలంలోని దేవునిపల్లి నుంచి శనివారం అర్ధరాత్రి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నట్లుగా అందిన సమాచారం మేరకు పోలీసులు దాడులు చేశారు. అనంతరం ఇసుకతో ఉన్న టిప్పర్‌ను జప్తు చేసి ఠాణాకు తరలించారు. అనంతరం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బతుకమ్మ వేడుకలను మహిళలు ఎంతో సంబురంగా జరుపుకుంటారు. తొమ్మిది రోజుల పాటు తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి ఉత్సాహంగా ఆడి పాడతారు. ఆదివారం నుంచి బతుకమ్మ పండుగ ప్రారంభం అయ్యాయి. పండుగ సందర్భంగా ఆడపడుచులకు రాష్ట్ర ప్రభుత్వం చీరలను పంపిణీ చేయనుంది. ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా "అక్కాచెల్లెళ్లకు.. మీ రేవంతన్న కానుక" పేరిట చేనేత చీరల పంపిణీకి ప్రభుత్వం సిద్ధమైంది. అయితే స్వయం సహాయక సంఘాల సభ్యులకు మాత్రమే చీరలను పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించడంతో మిగతా వారు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. - అక్షరటుడే, ఇందూరు



## బతుకమ్మ కానుక

# కొందరికే..

- మహిళా సంఘాల సభ్యులకే చీరలు
- ఒక్కొక్కరికి రెండు చీరలు పంపిణీ చేయనున్న ప్రభుత్వం
- ఉమ్మడి జిల్లాలో 3.98 లక్షల మంది సభ్యులు

తెలంగాణ మహిళలకు బతుకమ్మ అంటే అతి పెద్ద పండుగ. తొమ్మిది రోజుల పాటు ఊరు వాడా సందడి నెలకొంటుంది. దసరా సెలవులు కావడంతో మహిళలు పిల్లలు తల్లిగారింటికి చేరుకుంటారు. పండుగ విశిష్టతకు ప్రాధాన్యతనిస్తూ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత గత ప్రభుత్వం మహిళలకు కానుకగా బతుకమ్మ చీరలను పంపిణీ చేసింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక తొలి ఏడాది బతుకమ్మ చీరలను పంపిణీ చేయలేదు. ఈ సారి మాత్రం ఒక్కో మహిళకు రెండు చీరలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే స్వయం సహాయక సంఘాల సభ్యులకు మాత్రమే చీరలను పంపిణీ చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది.

### స్పష్టత కరువు

ఉమ్మడి జిల్లాలో మొత్తం 3.98 లక్షల మంది మహిళలు స్వయం సహాయక సంఘాల్లో ఉన్నారు. ఇందులో నిజామాబాద్ జిల్లాలో 2.19 లక్షల మంది, కామారెడ్డి జిల్లాలో 1.79 లక్షల మంది సభ్యులుగా ఉన్నారు. అయితే ప్రతి సభ్యురాలికి రెండేసి చీరలు పంపిణీ చేయనున్నారు. ఈ లెక్కన నిజామాబాద్ జిల్లాకు 4.38 లక్షల చీరలు, కామారెడ్డి జిల్లాకు 3.58 లక్షల చీరలు అవసరం అవుతాయి. మెప్మా ద్వారా మున్సిపాలిటీ, నగరపాలక సంస్థ పరిధిలోని సభ్యులకు, డీఆర్‌డీవో ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని సభ్యులకు చీరలను అందజేయనున్నారు. అయితే ఇప్పటి వరకు మాత్రం సంఘాల సభ్యులకు చీరల పంపిణీపై ఎటువంటి సమాచారం అందలేదు. సోమవారం నుంచి పంపిణీ చేస్తారా.. దసరా వరకు అందజేస్తారా అనేది స్పష్టత లేదు.

### సామాన్యులకు లేనట్టే..

ప్రత్యేక రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి బతుకమ్మ చీరల పంపిణీ కొనసాగుతోంది. తెల్ల రేషన్ కార్డు ఉన్న ప్రతి మహిళకు చీరలను పంపిణీ చేశారు. కానీ ఈ ఏడాది స్వయం సహాయక సంఘాల సభ్యులకు మాత్రమే అందజేయనున్నారు. దీంతో సాధారణ మహిళల్లో కాస్త అసంతృప్తి నెలకొంది. సంఘాల్లో సభ్యులుగా లేని ఎందరో పేద మహిళలు ఉన్నారని, కనీసం వారికైనా అందజేస్తే బాగుండని మహిళలు వాపోతున్నారు. గతంలోనూ చాలా వరకు రేషన్ కార్డు ఉన్న మహిళలకు చీరలు అందలేదు. కొంతవరకు పంపిణీ చేసి కోటా పూర్తయిందంటూ కేంద్రాలను మూసివేశారు. అయితే గతంలో చీరల క్వాలిటీ బాగా లేదనే విమర్శలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ప్రస్తుతం క్వాలిటీ విషయంలో ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకున్నట్లు సమాచారం. అయితే చీరలను ఎప్పటి నుంచి పంపిణీ చేస్తారనే విషయమై క్లారిటీ లేదు.



## హెచ్‌సీయూలో ఏబీవీపీ విజయం శుభ సూచకం

**అక్షరటుడే, ఇందూరు:** హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఏబీవీపీ విజయం సాధించడం శుభ సూచకమని జాతీయ కార్యవర్గ సభ్యుడు శివ అన్నారు. నగరంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో ఆదివారం విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో విద్యార్థులు, యువత జాతీయ భావాన్ని కోరుకుంటున్నారని, ఈ విజయం నాంది అన్నారు. వామపక్ష విద్యార్థి సంఘాలు, ఎన్‌ఎస్‌యూఐ లాంటి సంఘాల కూటమితో ఏబీవీపీ ఒంటరి పోరాటం చేసి విజయం సాధించిందన్నారు. ఎన్‌ఎస్‌యూఐకి నోటా కంటే తక్కువ ఓట్లు రావడం కాంగ్రెస్ రాజకీయాలను తిప్పి కొట్టినట్లు అయిందన్నారు. కమ్యూనిస్టు ప్రొఫెసర్ల మాటలు పక్కకు పెట్టి విద్యార్థులు ఏబీవీపీకి ఘనవిజయం అందించారన్నారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ బాలకృష్ణ, విభాగ్ సోషల్ మీడియా కన్వీనర్ సునీల్, తెలంగాణ యూనివర్సిటీ కార్యదర్శి సమీర్, కంఠేశ్వర్ జోనల్ ఇన్‌ఛార్జి దుర్గా దాస్, నాయకులు అశోక్, అనిల్, జగదీష్, అవిలాష్, రాము తదితరులు పాల్గొన్నారు.

## అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభ

**అక్షరటుడే, కోటగిరి :** మండల కేంద్రంలోని శ్రీ సాయి అయ్యప్ప మందిరంలో ఆదివారం అయ్యప్ప సేవా పరివార్ జోనల్ లెవెల్ సమావేశం నిర్వహించారు. అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభ తెలంగాణ రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు అయ్యప్ప దాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశం జరిగింది. ఇందులో అయ్యప్ప సేవలో గురుస్వాముల బాధ్యతలు, అయ్యప్ప, మణికంఠ, ధర్మశాస్త్ర సంబంధమైన వివరాలను సంఘ సభ్యులకు వివరించారు. సమావేశంలో ఆదిలాబాద్, నిర్మల్, కేరళ, నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల నుంచి హాజరయ్యారు. ఆలయ ధర్మకర్త పోలా విఠలరావు గుప్తా, తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యులు గోగినేని హనుమంతరావు, బీర్కూర్ గంగాధర్ గురు స్వామి, రాజా గురుస్వామి, శంకర్ గురుస్వామి, సుబ్రహ్మణ్యస్వామి, బర్ల రమేష్ స్వామి, అంజి బాబు స్వామి, వీరబాబు స్వామి, తదితరులు పాల్గొన్నారు.






వినాయక్‌నగర్ విగ్రహాల పార్క్ వద్ద నివాళులు



ఆర్మూర్‌లో..



ముప్కాల్ మండలంలో..

## కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలు మరువలేం

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కొండా లక్ష్మణ్ బాపూజీ చేసిన సేవలు మరువలేమని వక్తలు పేర్కొన్నారు. జిల్లాలో కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి సందర్భంగా ఆదివారం ఆయన చిత్రపటాలకు నివాళులు అర్పించారు. 95 ఏళ్ల వయసులోనూ రాష్ట్ర కోసం ఆయన అలుపెరగని పోరాటం చేశారని పలువురు వ్యాఖ్యానించారు. - అక్షరటుడే నెట్ వర్క్

## రోడ్డు ప్రమాదంలో ఆర్‌ఎంపీ మృతి

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** రోడ్డు ప్రమాదంలో ఓ ఆర్‌ఎంపీ మృతి చెందాడు. ఈ ఘటన కంజర వద్ద శనివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. మోపాల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నర్సింగ్‌పల్లి గ్రామానికి చెందిన వెల్దుర్కి గంగాధర్(53) ఆర్‌ఎంపీగా పనిచేస్తున్నాడు. అయితే శనివారం అర్ధరాత్రి తర్వాత కంజర గ్రామ సమీపంలోని రెసిడెన్షియల్ స్కూల్ వద్ద చెట్ల మధ్య పొదల్లో ఓ వ్యక్తి పడి ఉన్నాడని స్కూల్ వాచ్‌మన్ పోలీసులకు సమాచారం అందించాడు. దీంతో అక్కడికి చేరుకున్న పోలీసులు ఆ వ్యక్తిని వెల్దుర్కి గంగాధర్‌గా గుర్తించారు. కానీ అప్పటికే ఆయన మృతి చెంది ఉన్నట్లు పోలీసులు తెలిపారు. అనంతరం మృతుడి కుటుంబీకులకు సమాచారం అందించారు. అయితే ఆయన రోడ్డు ప్రమాదంలో మృతి చెంది ఉంటాడా.. లేక మరేదైనా కారణముందా అనే కోణంలో పోలీసులు విచారిస్తున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.





## రమావత్ లాల్ సింగ్‌కు డాక్టరేట్

**అక్షరటుడే, ఇందూరు:** జిల్లాలోని చందూరు మండలం కారేగాం తండాకు చెందిన రమావత్ లాల్ సింగ్‌కు ఉస్మానియా విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రకటించింది. లాల్ సింగ్ జిల్లా కేంద్రంలోని గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెండు డిగ్రీలు, తెలంగాణ విశ్వవిద్యాలయంలో ఎంఏ, ఆచార్య విశ్వవిద్యాలయంలో మాస్టర్ లైబ్రరీ సైన్స్ పూర్తి చేశారు. 2018లో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీ సీటు సాధించి స్వాతంత్రం అనంతరం 'దేశంలోని సంస్కృతి సంప్రదాయాల మధ్య జరుగుతున్న ఘర్షణ'పై పరిశోధన చేశారు. హిందీ విభాగంలో "సమకాలిన్ హిందీ ఉపన్యాస్ మే సాంప్రదాయక్ సంఘర్ష (19502000)" అనే అంశంపై ఆయన సిద్ధాంత గ్రంథాన్ని రూపొందించారు. ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో నిర్వహించిన ఓపెన్ వైవాలో రిటైర్డ్ ప్రొఫెసర్ అవినాష్ జైస్వాల్ పర్యవేక్షణలో పీహెచ్‌డీ పూర్తి చేశారు. ఎక్స్‌టర్నల్ ఎగ్జామినేటర్ ప్రొఫెసర్ జయకిషన్, నాంపల్లి మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ చంద్రముఖి ముఖర్జీ సంతృప్తి వ్యక్తం చేసి డాక్టరేట్‌ను ప్రకటించారు.

## వీడీసీ ఆగడాలను అరికట్టాలి..



**అక్షరటుడే, కోటగిరి :** ఆర్మూర్ ప్రాంతంలో రోజురోజుకు వీడీసీల ఆగడాలు మితిమీరుతున్నాయని తెలంగాణ రాష్ట్ర గీత కార్మిక సంఘం నాయకులు ఆరోపించారు. ఈ మేరకు కోటగిరిలో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. రాష్ట్ర కార్యదర్శి విఠల్ గౌడ్ మాట్లాడుతూ.. మూడు రోజుల కిందట ఏర్గట్ల మండలం తాళ్లరాంపూర్‌లో వీడీసీ సభ్యులు గీత కార్మికులపై దాడి చేశారని, వీరి ఆగడాలను అరికట్టాలని డిమాండ్ చేశారు. అంతేగాకుండా కుల వృత్తిదారులపై దాడులు చేసేవారిపై పీడీయాక్ట్ అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో గీత కార్మిక సంఘం నాయకులు బి వెంకట్ గౌడ్, ఎం శ్రీధర్ గౌడ్, రాజాగౌడ్, కార్మికులు కృష్ణ గౌడ్, ప్రకాష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## బీఎస్‌ఎన్‌ఎల్ కార్యాలయంలో స్వచ్ఛ భారత్



**అక్షరటుడే, ఆర్మూర్:** ఆర్మూర్ మహాత్మా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ప్రతివారం స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దీంట్లో భాగంగా ఆదివారం పట్టణంలోని శాస్త్రినగర్‌లోని బీఎస్‌ఎన్‌ఎల్ కార్యాలయం ఆవరణలో ఆదివారం స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయం ఆవరణలో ఉన్న పిచ్చిమొక్కలను తొలగించారు. కార్యాలయం చుట్టూ ఉన్న చెత్తను తొలగించి నీటితో శుభ్రం చేశారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది ఫహీమొద్దీన్, మహమ్మద్ సలీమొద్దీన్, సంస్థ సభ్యులు సుంకె నిశాంత్, ప్రశాంత్, వేద రాజ్ కుమార్, గణేష్, మధుసూదన్, వంట నరేష్, కుతాడి ఎల్లయ్య, వేణు, గణేష్, కృషివర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## చెరువులో పడి ఒకరి మృతి

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** నగర శివారులోని న్యాల్‌కల్ చెరువులో పడి ఒకరు మృతి చెందారు. మోపాల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. న్యాల్‌కల్ చెరువులో ఆదివారం మృతదేహం ఉన్నట్లు గుర్తించిన గ్రామస్థులు పోలీసులకు సమాచారం అందించారు. స్పందించిన పోలీసులు హుటాహుటిన చెరువు వద్దకు చేరుకున్నారు. మృతదేహాన్ని వెలికితీయించారు. నగరంలోని పార్ది గల్లీకి చెందిన గోల్డ్‌షాప్‌లో పనిచేసే ఓదెల అనిల్ మృతదేహంగా గుర్తించి.. కుటుంబీకులకు సమాచారం అందించారు. అయితే అనిల్ అదృశ్యమైనట్లు కుటుంబీకుల శనివారం నాల్గో టౌన్‌లో పోలీసులకు ఫిర్యాదు చేయగా.. మిస్సింగ్ కేసు నమోదు చేశారు. కానీ అనిల్ ఆదివారం న్యాల్‌కల్ చెరువులో శవమై తేలాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## వ్యక్తి అదృశ్యం

**అక్షరటుడే, కోటగిరి:** పోతంగల్ మండలంలో ఓ వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఎస్సై సునీల్ తెలిపిన వివరాల ప్రకారం.. పోతంగల్ మండల కేంద్రానికి చెందిన గంగం మహేందర్ ఆదివారం ఉదయం నుంచి కనిపించడం లేదని ఆయన కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మహేందర్ తండ్రి నీలకంఠం ఫిర్యాదును స్వీకరించిన పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. సంబంధిత వ్యక్తి ఆచూకీ తెలిస్తే వెంటనే 9908237247, 8019276785, 9014377883, 9440094905, 8712659878 నంబర్లను సంప్రదించాలని సూచించారు.